క్లుప్తంగా

విద్యుత్ సరఫరాలో అంతరాయంపై ఫిర్యాదు

మహబూబ్‌నగర్ రూరల్: మండలంలోని దివిటిపల్లి డబుల్‌బెడ్రూం ఇళ్ల కాలనీలో విద్యుత్ అంతరాయంపై శనివారం సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో విద్యుత్ వినియోగదారుల ఫోరంలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు నల్లవెల్లి కురుమూర్తి మాట్లాడుతూ.. డబుల్‌బెడ్రూం ఇళ్లలో లోటల్టేజీ సమస్యతో ఎలక్ట్రానిక్ పరికరాలు కాలిపోతున్నాయని తెలిపారు. చిన్నపాటి వర్షం వచ్చినా.. గాలి వీచినా విద్యుత్ సరఫం నిలిచిపోతుండటంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. విద్యుత్ వినియోగదారుల ఫోరం స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు వరద గాలెన్న, కడియాల మోహన్, ప్రచార కార్యదర్శి రామాంజనేయులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ మార్చొద్దు

జడ్చర్ల: పట్టణంలోని 10వ వార్డులో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను మరో చోటకు మార్చవద్దని కాలనీవాసులు కోరారు. ఈ మేరకు శనివారం జరిగిన విద్యుత్ వినియోగదారుల సమావేశంలో ఫిర్యాదు చేశారు. ట్రాన్స్‌ఫార్మర్ మార్పుతో విద్యుత్ లైన్ నివాసగృహాల మీదుగా వెళ్లే పరిస్థితి ఉందని తెలిపారు.

జీఓ 29 రాజ్యాంగ విరుద్ధం

స్టేషన్ మహబూబ్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీఓ 29 రాజ్యాంగ విరుద్ధమని.. ఆ జీఓను వెంటనే రద్దు చేయాలని బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎం.శ్రీనివాస్‌సాగర్ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఉద్యోగ పోటీ పరీక్షల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు అత్యధిక మార్కులు వచ్చినా.. ఓపెన్ కేటగిరీలో కలపకుండా రిజర్వేషన్ కోటాలో కలిపి మోసం చేస్తున్నారన్నారు. అగ్రవర్ణాల వారికి అవకాశాలు కల్పిస్తున్న జీఓ 29ని రద్దు చేయాలని శాంతియుతంగా దీక్షలు, నిరసన కార్యక్రమాలు చేపట్టిన విద్యార్థులు, నిరుద్యోగులపై పోలీసులు లాఠీచార్జ్ చేయడాన్ని బీసీ సమాజ్ తీవ్రంగా ఖండిస్తుందని పేర్కొన్నారు. ఆధిపత్య కులాలకు అనుకూలంగా తీసుకువచ్చిన జీఓ 29ని రద్దుచేసి.. బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు, నిరుద్యోగులకు న్యాయం చేయాలన్నారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి

జడ్చర్ల టౌన్: పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో మృతిచెందిన నవజాత శిశువు కుటుంబానికి తగిన న్యాయం చేయాలని జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ కోడ్గల్ యాదయ్య కోరారు. శనివారం వార్డు కౌన్సిలర్ సతీష్‌తో కలిసి ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.చంద్రకళను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గర్భిణి ప్రసవ సమయంలో గైనకాలజిస్ట్ లేకపోవడంతోనే శిశువు మృతిచెందిందని ఆరోపించారు. శిశువు మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. వారి వెంట బీఆర్‌ఎస్ నాయకులు ప్రణీల్‌చందర్, పాలాది రామ్మోహన్, కరాటే శ్రీను, కిరణ్ ఉన్నారు.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి

స్టేషన్ మహబూబ్‌నగర్: ప్రభుత్వ, వివిధ కార్పొరేషన్లలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని ఆల్‌ఫైజ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు జహంగీర్‌బాబా కోరారు. ఈ మేరకు శనివారం సొసైటీ తరఫున సీఎం కార్యాలయానికి మెయిల్ ద్వారా వినతిపత్రం పంపించినట్లు పేర్కొన్నారు. మత్స్యశాఖ, ఆర్టీసీ కార్పొరేషన్, వైద్యం ఇతర విభాగాల్లో ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి, కార్మికులకు 2021 పేస్కేల్, ఇతర బకాయిలు చెల్లించాలని తదితర సమస్యలను పరిష్కరించాలని కోరారు.

కార్మికుల ఆందోళన

పాలమూరు: ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో పనిచేస్తున్న కార్మికులపై వేధింపులు ఆపాలని డిమాండ్ చేస్తూ శనివారం తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. నెలరోజులుగా అధికారులు కక్షపూరితంగా వ్యవహరించడంపై పారిశుద్ధ్య కార్మికులు తమ విధులను బహిష్కరించి, నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సురేష్ పాల్గొన్నారు.

పశువులకు టీకాలు

మిడ్జిల్: మండల కేంద్రంలో పశువులకు గాలికుంటు నివారణ టీకాల పంపిణీ కార్యక్రమాన్ని శనివారం జడ్చర్ల మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జ్యోతి ప్రారంభించారు. మొదటి రోజు 332 పశువులకు టీకాలు వేసినట్లు వెటర్నరీ డాక్టర్ శివరాజ్ తెలిపారు. అల్వాల్‌రెడ్డి, గౌస్, పర్వతాలు, సత్యం, బాలస్వామి, మల్లయ్య, లాలు, సాగర్, నర్సింహులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

కోయిల్‌కొండ: ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం పీఆర్టీయూతోనే సాధ్యమని మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానిక ఎమ్మార్సీ భవనంలో నూతన ఉపాధ్యాయులకు యూనియన్ సభ్యత్వం అందజేశారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి పాటుపడాలి



దేవరకద్ర ఈశ్వర వీరప్పయ్యస్వామి దేవస్థానం పాలక మండలి చైర్మన్ నర్సింహారెడ్డికి నియామక పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

దేవరకద్ర/దేవరకద్ర రూరల్: క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. శనివారం దేవరకద్ర పట్టణ కాంగ్రెస్ నూతన కమిటీని ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా ఎస్టీ ఫారూఖ్, ఉపాధ్యక్షులుగా కుర్వ జవహర్, జగన్మోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా బాలరాజు, కార్యదర్శులుగా బంగిరాజు, ఆంజనేయులు, కోశాధికారిగా శ్రీనివాసులు ఎన్నిక కాగా.. పార్టీ తరఫున ఎమ్మెల్యే నియమాక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందేలా చూడాలని కోరారు.

■ దేవరకద్రలోని ప్రసిద్ధ ఈశ్వర వీరప్పయ్యస్వామి దేవస్థానం నూతన కమిటీ సభ్యులకు ఎమ్మెల్యే నివాసంలో నియామకపత్రం అందజేశారు. దేవస్థానం చైర్మన్‌గా బీసు నర్సింహారెడ్డి, సభ్యులుగా రాఘవేంద్ర, వెంకటయ్య, లక్ష్మమ్మ, ఉస్సేనయ్య, నాగరాజులను నియమించినట్లు తెలిపారు. అనంతరం పెద్దరాజమూర్ గ్రామానికి చెందిన మహిళకు మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కును ఎమ్మెల్యే అందజేశారు.

పలు సమస్యలపై వినతి..

కౌకుంట్ల మండలంలో నెలకొన్న సమస్యలపై గ్రామస్తులు ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ప్రధానంగా పుట్టపల్లిలో గోదాంల వద్ద రైల్వేగేటు మూసివేతతో వాహనదారులు, ప్రజలు అవస్థలు పడుతున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. అక్కడ అండర్‌పాస్ నిర్మించాలని కోరారు. అంగన్‌వాడీ కేంద్రాలకు శాశ్వత భవనాలు నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. అయితే అండర్ పాస్ నిర్మాణంపై రైల్వే జీఎంతో మాట్లాడతానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమాల్లో తహసీల్దార్ కృష్ణయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంజిల్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, ఆదిహన్మంతరెడ్డి, అంజన్‌కుమార్‌రెడ్డి, రాంపాండు, శ్రీనివాస్‌రెడ్డి, వర్మ, రాము, కిషన్‌రావు, నరేష్, ఆంజనేయులు, శ్రీనివాస్‌రెడ్డి, కొండన్న, నాగన్న, ప్రసాద్ పాల్గొన్నారు.

పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక



మహిళా సంఘాల ప్రతినిధులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

జడ్చర్ల: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికను పారదర్శకంగా నిర్వహించాలని స్థానిక ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానిక క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని మహిళా సంఘాల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఇందిరమ్మ కమిటీల్లో మహిళా సంఘాల సభ్యులకు ప్రాధాన్యత ఇచ్చినట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లు అనర్హులకు దక్కకుండా చూడాల్సిన బాధ్యత మహిళా సంఘాల సభ్యులదేనని అన్నారు. అర్హులను మాత్రమే ఎంపిక చేయాలని సూచించారు. గతంలో డబుల్‌బెడ్రూం ఇళ్ల మాదిరిగా అక్రమాలకు తావివ్వవద్దని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తుందని.. ఎక్కడా అవినీతి, అక్రమాలకు ఆస్కారం లేకుండా చూస్తామన్నారు. వచ్చే సంక్రాంతి లేదా ఉగాది పండగకు తన సొంత ఖర్చుతో ప్రతి మహిళకు నాణ్యత గల చీరను అందజేస్తానని చెప్పారు. ఊర్కొండలో మహిళా సంఘం భవనానికి స్థలాన్ని కేటాయించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. భవన నిర్మాణానికి తన సొంత డబ్బు రూ. లక్ష అందిస్తానన్నారు. అదేవిధంగా అన్ని మండల మహిళా సమాఖ్య భవనాల మరమ్మతు, కొత్త భవనాల మంజూరుకు ప్రభుత్వ నిధులతో పాటు పరిశ్రమల సీఎస్ఆర్ నిధులను తీసుకువచ్చేందుకు కృషి చేస్తానన్నారు. జడ్చర్ల మహిళా సమాఖ్య భవనానికి రూ.5 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. నవాబుపేట సీతాఫలాల పల్పింగ్ యూనిట్‌లో సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. సమావేశంలో ఐకేపీ ఏపీఎంలు, కోఆర్డినేటర్లు ఉన్నారు.

విద్యార్థులు ఉన్నతంగా రాణించాలి



విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలను అందజేస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: విద్యార్థులు జీవితంలో ఉన్నతంగా రాణించేందుకు ప్రణాళికా బద్ధంగా చదువుకోవాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శనివారం పూర్వ విద్యార్థుల అసోసియేషన్ ఆధ్వర్యంలో 66 మంది ప్రతిభా విద్యార్థులకు రూ. 4.55 లక్షల నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్యార్థులు అనవసర విషయాల జోలికి వెళ్లకుండా, చదువుపై పూర్తి స్థాయిలో దృష్టి కేంద్రీకరించాలన్నారు. రాష్ట్రం ప్రభుత్వం విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రాష్ట్రంలోని యూనివర్సిటీలు, కళాశాలలను బలోపేతం చేస్తామన్నారు. యువతలో నైపుణ్యాభివృద్ధికి ప్రతి జిల్లా కేంద్రంలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పాలమూరు యూనివర్సిటీలో లా, ఇంజినీరింగ్ కళాశాలను ఏర్పాటుకు అవసరమైన భవనం నిర్మాణంలో ఉందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నర్సింహారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ మోహన్‌బాబు, పూర్వ విద్యార్థులు రామేశ్వర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పిల్లల చదువుపై శ్రద్ధ చూపాలి



నవాబుపేట/కోయిల్‌కొండ/అడ్డాకుల: పిల్లల చదువుపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ప్రధానోపాధ్యాయులు కోరారు. నవాబుపేట, కోయిల్‌కొండ, అడ్డాకుల మండలాల్లోని పలు పాఠశాలల్లో శనివారం తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని వసతులు కల్పిస్తూ.. మెరుగైన విద్య అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమాల్లో హెచ్‌ఎంలు విష్ణు, నర్సింహులు, ఎస్.వెంకటేష్, మాజీ సర్పంచ్ జమునాబాయి, మాజీ ఎంపీటీసీ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

సేవాలాల్ ఆలయ స్థలం పరిశీలన

నవాబుపేట: మండలంలోని యన్మన్‌గండ్ల సమీపంలో సేవాలాల్ మహరాజ్ ఆలయ నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని శనివారం ఆర్డీఓ నవీన్ పరిశీలించారు. ఈ సందర్భంగా మండల అధికారులతో కలిసి సర్వే చేయించడంతో పాటు పూర్తి వివరాలు సేకరించారు. జిల్లా కేంద్రానికి వెళ్లే రహదారి సమీపంలో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని సేవాలాల్ మహరాజ్ ఆలయ నిర్మాణానికి కేటాయించినట్లు తెలిపారు. ఆర్డీఓ వెంట తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ జయరాంనాయక్, ఆర్‌ఐ కిరణ్, మాజీ ఎంపీటీసీ తులసీరాం నాయక్, శంకర్ తదితరులు ఉన్నారు.

ముడా చైర్మన్‌కు సన్మానం

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ముడా చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన లక్ష్మణ్ యాదవ్‌ను శనివారం యాదవ విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బైకని బాలుయాదవ్, అఖిలభారత యాదవ మహాసభ రాష్ట్ర కార్యదర్శి రవికుమార్, గొర్రెల కాపరుల సంఘం అధ్యక్షుడు శాంతన్న, నారాయణయాదవ్, భరత్‌కుమార్, నర్సింహులు, పర్వతాలు, రాములు, మల్లేష్, రాము పాల్గొన్నారు.

ఎంబీబీఎస్ విద్యార్థులకు..

మహమ్మదాబాద్: ఎంబీబీఎస్ సీట్లు సాధించిన స్థానిక ఏటీఆర్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులకు శనివారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. వివిధ కళాశాలల్లో విద్యార్థులు అంకిళ్ల తనుశ్రీ, భేరి అర్చన, నితీన్ ఎంబీబీఎస్ సీట్లు సాధించారని పాఠశాల కరస్పాండెంట్ అంజిరెడ్డి తెలిపారు.

బోరుమోటారు ఏర్పాటు

చిన్నచింతకుంట: కురుమూర్తిస్వామి జాతర మైదానంలో భక్తుల సౌకర్యార్థం దాతల సహకారంతో తాగునీటి బోరుమోటారును శనివారం ఈఓ మదనేశ్వర్‌రెడ్డి, పాలక మండలి సభ్యుడు గోవర్ధన్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో దాతలు వెంకటరమణగౌడ్, సూర్య, విష్ణు, కిరణ్, బందెల శ్రీకాంత్ పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

మహమ్మదాబాద్: పంటల్లో చీడపీడల నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏఓ నరేందర్ రైతులకు సూచించారు. వివిధ గ్రామాల్లో శనివారం పంటలను పరిశీలించి, వివిధ రకాల చీడపీడల నివారణపై రైతులకు అవగాహన కల్పించారు.

రైతు సంక్షేమ పథకాల అమలులో విఫలం



మూసాపేటలో ఎన్‌హెచ్-44పై ధర్నా చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

అడ్డాకుల: రైతు సంక్షేమ పథకాల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీఆర్‌ఎస్ నాయకులు ధ్వజమెత్తారు. వానాకాలం పంటల సాగుకు సంబంధించి రైతుభరోసా నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం మూసాపేట మండల కేంద్రంలో 44వ నంబర్ జాతీయ రహదారిపై ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వానాకాలం పంటలకు రైతుభరోసా ఇవ్వబోమని సంబంధిత మంత్రి చెప్పడం దారుణమన్నారు. రైతులను ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని ఆరోపించారు. రైతులకు వెంటనే రైతుభరోసా నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మండల అధ్యక్షుడు లక్ష్మీనర్సింహయాదవ్, గూపని కొండయ్య, బోయిని చంద్రశేఖర్, మదీనా జమీర్, భీమయ్య, శరత్‌గౌడ్, మధు, చిరంజీవి, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

వీరజవాన్ల సేవలు మరవలేనివి



ఆంజనేయులుజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీఆర్‌పీఎఫ్ జవాన్లు, కుటుంబ సభ్యులు

హన్వాడ: దేశం కోసం నేను సైతం అంటూ వీరజవాన్లు అందించిన సేవలు మరవలేనివని సీఆర్‌పీఎఫ్ ఏఎస్‌ఐ సాంసోన్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో సీఆర్‌పీఎఫ్ వీరజవాన్ ఆంజనేయులుజీ వర్ధంతిని కుటుంబ సభ్యుల సమక్షంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయులుజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఏఎస్‌ఐ మాట్లాడుతూ.. దేశం కోసం పనిచేయడంలోనే గొప్పతనం ఉంటుందన్నారు. దేశ సరిహద్దులో ముష్కరులతో జరిగిన పోరులో జవాన్ ఆంజనేయులుజీ వీరమరణం పొంది చిరస్మరణీయుడిగా నిలిచారని కొనియాడారు. కార్యక్రమంలో వీరజవాన్ తల్లి అనుసూజబాయి, సోదరులు కిషన్‌జీ, రాజేందర్‌జీ, చంద్రశేఖర్, సీఆర్‌పీఎఫ్ జవాన్ మల్లేష్, స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

శబరిమలకు పాదయాత్ర



నవాబుపేట: మండల కేంద్రం నుంచి అయ్యప్ప స్వాములు శనివారం శబరిమలకు పాదయాత్ర చేపట్టారు. ముందుగా స్థానిక శివాలయంలో అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ఇరుముడి ధరించారు. అనంతరం శబరిమలకు బయలుదేరిన స్వాములను కుటుంబ సభ్యులు, భక్తులు సాగనంపారు. దాదాపు 40 రోజులపాటు పాదయాత్ర కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో బోని సాయి, బంటి స్వామి, గురుస్వామి సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి సైన్స్ డ్రామా పోటీల్లో జిల్లా విద్యార్థులు సత్తా చాటారు. బెస్ట్ స్క్రిప్ట్ రైటర్‌గా కె.దీక్షిత ఎంపిక కాగా.. రాష్ట్ర ఎస్‌సీఆర్టీఈ డైరెక్టర్ రమేష్ ప్రశంసాపత్రం అందజేసి అభినందించారు. వచ్చేనెల రెండో వారంలో మైసూర్‌లో జరిగే సౌత్ ఇండియా పోటీల్లో విద్యార్థిని దీక్షిత పాల్గొంటుందని తెలిపారు. ఈ సందర్భంగా డీఈఓ రవీందర్ విద్యార్థినిని అభినందించారు.

పీయూ అధ్యాపకుడికి డాక్టరేట్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ ఫార్మసీ కళాశాల అధ్యాపకుడు బైరి సురేష్‌కు ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రకటించింది. ప్రొఫెసర్ అళగిరి స్వామి ఆధ్వర్యంలో 'డిజైన్ సింథసిస్ బయాలజికల్ ఎవల్యూవేషన్ ఆఫ్ హెటిరో సైక్లిక్ హైబ్రిడ్స్ యాస్ యాంటీ క్యాన్సర్ ఏజెంట్స్' అంశంపై పరిశోధన పత్రం సమర్పించినందుకు గాను డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా పీయూ రిజిస్ట్రార్ మధుసూదన్‌రెడ్డి ఆయనను అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నూర్జహాన్, హెచ్‌ఓడీ ప్రభాకర్‌రెడ్డి, అర్జున్‌కుమార్, రవికుమార్ పాల్గొన్నారు.

బీటీరోడ్డు నిర్మాణానికి కొలతలు

గండేడ్: మండలంలోని చెన్నాయపల్లి నుంచి రెడ్డిపల్లి వరకు బీటీరోడ్డు నిర్మాణానికి రూ. 3.6 కోట్లు మంజూరయ్యాయి. శనివారం పంచాయతీ రాజ్ అధికారులు రోడ్డు కొలతలు చూసుకొని ప్రణాళికలు రూపొందించారు. కార్యక్రమంలో పీఆర్ ఈఈ నరేందర్‌రెడ్డి, డిప్యూటీ ఈఈ సురేందర్‌రెడ్డి, ఏఈలు హలీం, మతీన్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పుల్లారెడ్డి పాల్గొన్నారు.

అప్రమత్తత అవసరం

నవాబుపేట: సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరముందని ఎస్‌ఐ విక్రమ్ అన్నారు. శనివారం నవాబుపేట జూనియర్ కళాశాలలో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు సాధ్యమైనంత వరకు సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండాలని సూచించారు.

మార్కెట్‌లో మోసాలకు పాల్పడితే చర్యలు



మాట్లాడుతున్న మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బెక్కరి అనిత

మహబూబ్‌నగర్ (వ్యవసాయం): జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో అవకతవకలకు తావులేకుండా క్రయవిక్రయాలు చేపట్టాలని మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బెక్కరి అనిత అన్నారు. శనివారం మార్కెట్ కమిటీ కార్యాలయంలో ట్రేడర్లు, కమీషన్ ఏజెంట్లతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మార్కెట్ యార్డులో ధాన్యం అమ్మేందుకు వచ్చే రైతులను మోసానికి గురిచేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. మార్కెట్ యార్డులో రైతులకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి సానుకూలంగా ఉన్నారని.. ఆ దిశగా మార్కెట్ అధికారులు కార్యాచరణ రూపొందించాలని సూచించారు. సమావేశంలో వైస్‌చైర్మన్ పెద్ద విజయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయాలి



సైన్స్‌ఫేర్‌లో ప్రదర్శనలను తిలకిస్తున్న డీఈఓ రవీందర్

జడ్చర్ల టౌన్: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలని డీఈఓ రవీందర్ అన్నారు. మున్సిపాలిటీలోని శ్లోక పాఠశాలలో శనివారం నిర్వహించిన సైన్స్‌ఫేర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రూపొందించిన 700 ఎగ్జిబిట్‌లను పరిశీలించారు. అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు అభినందనలు తెలిపారు. అనంతరం డీఈఓ మాట్లాడుతూ.. విద్యార్థుల్లోని ప్రతిభ, సృజనాత్మకతను వెలికి తీసేందుకు సైన్స్‌ఫేర్ ఉపయోగపడుతుందన్నారు. విద్యార్థులు కొత్త కొత్త విషయాలను తెలుసుకోవడంతో పాటు పరిశోధనలపై ఆసక్తి పెరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో డీఎస్ఓ శ్రీనివాస్, ఎంఈఓ మంజులాదేవి, పాఠశాల ప్రిన్సిపాల్ ప్రతిభ పాల్గొన్నారు.

బాదేపల్లి హెచ్‌ఎంకు షోకాజ్ నోటీసు

జడ్చర్ల టౌన్: బాదేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం, పాఠశాల మిడ్‌డే మీల్స్ ఇన్‌చార్జికి జిల్లా విద్యాశాఖ అధికారి షోకాజ్ నోటీసులను జారీ చేశారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో గుడ్లను అందించకుండానే బిల్లులు చేయడంపై సీసీఏ నిబంధనల ప్రకారం చర్యలు ఎందుకు తీసుకోకూడదో వివరణ ఇవ్వాలని నోటీసులో పొందుపర్చారు. జూన్, జూలై నెలల్లో వారానికి మూడు గుడ్లకు బదులుగా రెండు మాత్రమే ఇచ్చారని.. ఆగస్టు, సెప్టెంబర్ 26 వరకు ఒక్క గుడ్డు ఇవ్వకుండానే ఇచ్చినట్టుగా బిల్లులు సమర్పించడాన్ని తప్పుపట్టారు. మూడు రోజుల్లోగా సమాధానం ఇవ్వాలని నోటీసులో పేర్కొన్నారు.

బిడ్డతో సహా తల్లి అదృశ్యం

జడ్చర్ల: మండలంలోని గొల్లపల్లికి చెందిన చంద్రకళ తన బిడ్డతో సహా అదృశ్యమైనట్లు ఎస్‌ఐ చంద్రమోహన్ తెలిపారు. ఎస్‌ఐ వివరాల మేరకు.. గొల్లపల్లికి చెందిన చంద్రయ్య – చంద్రకళ దంపతులకు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. శుక్రవారం వారి పెద్ద కూతురు స్కూల్‌కు వెళ్లగా.. చంద్రయ్య కూలీ పనులకు వెళ్లాడు. అతడు పనులను ముగించుకుని ఇంటికి వచ్చే సరికి భార్య చంద్రకళ, చిన్నకూతురు కనిపించకుండా పోయారు. భార్యకు ఫోన్‌చేయగా.. ఇంటి తాళం చెవి జాడ చెప్పి ఫోన్ స్విచ్ ఆఫ్ చేసింది. తన భార్యను మాచారం గ్రామానికి చెందిన వ్యక్తి తీసుకెళ్లాడని అనుమానం వ్యక్తంచేస్తూ.. చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.